క్లుప్తంగా

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యం చేస్తున్న చిన్నారులు

చిల్లకూరు: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పలు పాఠశాలల్లో బుధవారం చిన్నారులు ఉగాది విశిష్టతను తెలియజేసేలా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. విద్యార్థులు ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఉగాది పండుగ రోజున పచ్చడిని తయారు చేస్తారని, ఇందులో ఆరు రకాలు(షడ్రుచులు) తీపి, పులుపు, కారం, చేదు, వగరు, ఉప్పు మేళవింపు ఉంటుందని, జీవితంలో కూడా ఇలా అన్ని రకాలుగా ఉంటుందని తెలిపారు. అనంతరం పలువురు ఈ కార్యక్రమాల్లో బాలచెన్నయ్య, గుమ్మడి సుబ్బయ్య, ఉడాది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీలకు సన్మానం నేడు

వెంకటగిరి: కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీలకు గురువారం వెంకటగిరిలో సన్మానం చేయనున్నట్లు నేదురుమల్లి కార్యాలయ వర్గాలు బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశాయి. వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీలు మేరిగ మురళీధర్, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని స్థానిక పద్మశాలి కల్యాణ మండపంలో గురువారం సాయంత్రం 3.00 గంటలకు సన్మానించనున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నాయి. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరాయి.

చిన్నారులకు నూతన వస్త్రాలు పంపిణీ



బాలసదన్ చిన్నారులకు నూతన వస్త్రాలు అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

వెంకటగిరి: పట్టణంలోని బాలసదన్‌లోని అనాథ చిన్నారులకు ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం దాత పుత్తా రమేష్, ఆయన సో దరులు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా దాత రమేష్ మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని, చిన్నతనం నుంచే చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బాలసదన్ ఇన్‌చార్జ్ విజయలక్ష్మి, దాత కుటుంబసభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి కోతలు



వరి కోస్తున్న యంత్రం

ఓజిలి: మండలంలోని పలు గ్రామాల్లో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. బత్తలాపురం, మానమాల, భట్లకనుపూరు, వెంకటరెడ్డిపాళెం, చుట్టుగుంట, కొండవల్లిపాడు తదితర గ్రామాల్లోని రైతులు కోతలు ముమ్మరం చేశారు. గత నాలుగు రోజులుగా వర్షాలు కురిసి, నేల తేమ అధికంగా ఉండడంతో చైన్ మిషన్లతో పంట కోతలు చేస్తున్నారు. వరికి గిట్టుబాటు ధర కూడా ఉండడంతో వరికోతలకు ఆసక్తి చూపుతున్నారు. కురుగొండ, కుందాం గ్రామాల్లోని సహకార సంఘాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా సతీష్‌రెడ్డి జన్మదిన వేడుకలు



వైఎస్సార్ సీపీ నేత సతీష్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మనుబోలు సతీష్‌రెడ్డి తన 43వ జన్మదిన వేడుకలను బుధవారం స్థానిక బాలాజీ నగర్ కూడలి ప్రాంతంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేయించి సతీష్‌రెడ్డి, తదితరులకు తినిపించారు. ఈ కార్యక్రమంలో ఏఏబీ మండల చైర్మన్ దేగపూడి కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నం అనీష్ నాయుడు, పెరికల అశోక్ యాదవ్, దుగ్గన వినీష్ యాదవ్, వినోద్ కుమార్, నాని, రాజేష్, శేషు, శంకరయ్య, సునీల్, ధనుంజయరావు, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

నల్లగంగమ్మకు విశేష పూజలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని బహదూరుపేట వద్ద గల నల్లగంగమ్మ ఆలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారిని కామాక్షమ్మ దవనం అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

భక్తి శ్రద్ధలతో ఉగాది వేడుకలు

- ఆలయాల వద్ద బారులు తీరిన భక్తులు



సూళ్లూరుపేట : లక్షకుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు



వెంకటగిరి: పోలేరమ్మ ఆలయం వద్ద భక్తుల కోలాహలం

నాయుడుపేటటౌన్: శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను నాయుడుపేట మండలంలో ప్రజలు బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఉగాది పచ్చడి, అంబళ్లు పంపిణీ చేశారు. పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న శ్రీవల్లీదేవసేన సమేత షణ్ముగ సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తొలుత రాజగోపాలపురంలో ఉన్న రామాలయం వద్ద నుంచి భక్తులు 108 కలశాలలో అభిషేక ద్రవ్యాలతో ఊరేగింపుగా సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయం వద్దకు తీసుకువచ్చి, అభిషేక పూజలు చేశారు. పోలేరమ్మ, వాసవీ కన్యాక పరమేశ్వరి ఆలయాల వద్ద పంచాంగ శ్రవణం జరిపారు. పట్టణంలోని అంకమ్మ, మానసదేవి(నాగమాసలమ్మ)ఆలయాల వద్ద ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి రాత్రి అమ్మవారి నగరోత్సవం నిర్వహించారు. తిమ్మాజీకండ్రిగలో దుర్గామల్లేశ్వరి దేవి ఆలయం, నరసారెడ్డికండ్రిగలో మహాలక్ష్మమ్మ దేవస్థానంలో కలశ ప్రతిష్ట జరిపి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పంచాగ శ్రవణం, రాత్రి అమ్మవారి నగరోత్సవం ఘనంగా నిర్వహించారు.

సాయిబాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు

పట్టణంలోని అగ్రహారపేట ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల ఆధ్వర్యంలో 3 వేల కిలోలకుపైగా 36 రకాల పుష్పాలతో బాబాకు పుష్పయాగం చేశారు. బ్రాహ్మణ వీధిలోని సాయిబాబా ఆలయంలో మహిళలు సాముహిక సత్యనారాయణస్వామి వ్రత పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని అన్నమేడు, మేనకూరు, పుదూరు ఆలయాల్లో పూజలు, పంచాంగ శ్రవణం కార్యక్రమాలు నిర్వహించారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

వెంకటగిరి: నియోజకవర్గంలో బుధవారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. శోభకృత్ నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రత్యేక పూజలు చేయడానికి భక్తుల రాకతో పట్టణంలోని పోలేరమ్మ ఆలయం, ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం, కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం, బాబా మందిరాలు కిటకిటలాడాయి. పోలేరమ్మ ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం ఈఓ. శ్రీనివాసులురెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉగాది పచ్చడి పంచి పె ట్టారు. మల్లమ్మగుడిలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తా రు. భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.

సైదాపురంలో

సైదాపురం: శోభకృత్ నామ సంవత్సరం పేరుకు సార్థకత చేకూర్చేలా అన్నివర్గాల ప్రజలకు కొత్త ఏడాదిలో విజయాలు కలగాలని అన్నీ దేవాలయాల్లో ఉగాది సందర్భంగా బుధవారం ప్రత్యేకంగా పూజలు చేశారు. మండల కేంద్రమైన సైదాపురం సమీపంలో ఉన్న సిద్ధలయ్య కోనలో ఉగాది సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీబాలాత్రిపుర సుందరీదేవి ఆలయంలో ఉగాది వేడుకలను నిర్వహించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఓజిలి: ఉగాది పర్వదినం పురష్కరించుకుని పలు ఆలయాల్లో భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓజిలి గ్రామంలోని నాగార్పమ్మ ఆలయంలో అమ్మవారికి మహిళలు పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పొంగళ్లుపెట్టారు. అలాగే మండలంలోని ఓజిలి, మానమాల గ్రామంల్లోని బాబా మందిరాల్లో సాయినాథునికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దొరవారి సత్రంలో..

దొరవారిసత్రం: మండలంలోని పలు ఆలయా ల్లో బుధవారం శోభకృత్ నామ సంవత్సరం ఉగాది పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. షడ్రుచుల కలిగిన ఉగాది పచ్చడిని పూజల్లో పాల్గొన్న భక్తులకు అందజేశారు. శ్రీధనమల్లి, నెలబల్లి, పూలతోట, నేలపట్టు, మైలాంగం, తనియాలి, కల్లూ రు తదితర ప్రాంతాల్లోని వేంకటేశ్వర స్వామి, శివాలయం, రాజరాజేశ్వరి ఆలయాలు ఉగాది పర్వదినం సందర్భంగా విద్యుత్ దీపాలతో అలకరించారు.

కలవకొండలో పంచాంగ శ్రవణం

చిల్లకూరు: ఉగాది సందర్భంగా బుధవారం కలవకొండలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అర్చకులు పంచాంగ శ్రవణం చేశారు. ఉదయం చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి వారికి పలు రకాల అభిషేకాలు చేశారు. ఆలయ చైర్మన్ కందల ఆనంద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ప్రత్యేక పూజలకు ఉభయకర్తలుగా కొత్త పాళేనికి చెందిన దర్శి దుర్గా అశోక్‌కుమార్, సౌమ్య వ్యవహరించారు.

వైభవంగా లక్షకుంకుమార్చన

సూళ్లూరుపేట: మండలంలోని చెంగాళమ్మ ఆలయంలో ఉగాది సందర్భంగా లక్షకుంకుమార్చన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, కుంకుమార్చన పూజలు చేశారు.



పుష్పయాగంలో పాల్గొన్న భక్తులు



ఓజిలి: ప్రత్యేక అలంకరణలో బాబా



చిల్లకూరు: లక్ష్మీనరసింహస్వామి



వెంకటగిరి: విశేషాలంకారంలో మల్లమ్మ



చిల్లకూరు: పంచాంగ శ్రవణం చేస్తున్న ఆలయ అర్చకులు



నాయుడుపేట టౌన్: పోలేరమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ



సైదాపురం: సిద్దేశ్వరస్వామి

విజేతలకు బహుమతుల ప్రదానం



భగవద్గీత కంఠస్థ పోటీలకు హాజరైన విద్యార్థులు

కలువాయి: హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు మండల స్థాయి భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు ఘనంగా నిర్వహించారు. శివసాయి కళాశాల ప్రాంగణంలో 3 నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులను నాలుగు కేటగిరీలుగా విభజించి, పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలకృష్ణయ్య, సమితి సభ్యులు రామచంద్రయ్య, ప్రసన్నకుమార్, శ్రీనివాసులు, జీవీ రమణయ్య, శివకుమార్, మల్లికార్జున, విజయభాస్కర్ రెడ్డి, విశ్వనాథరెడ్డి, ప్రసాద్, శ్యామలమ్మ, రాధారాణి, సంస్కృత పండితులు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పోలేసమ్మకు పొంగళ్లు



పొంగళ్లు పెట్టుకునేందుకు వచ్చిన భక్తులు

నాయుడుపేటటౌన్: జువ్వలపాళెంలోని పోలేసమ్మ ఆలయంలో అమ్మవారికి గ్రామస్తులు బుధవారం పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. సీఐ వైవీ సోమయ్య, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఈ కార్యక్రమంలో పాల్గొని, పూజలు చేశారు. ఉగాది పండుగ సందర్భంగా గ్రామస్తులు ఊరేగింపుగా వచ్చి గ్రామ దేవత పోలేసమ్మకు పొంగళ్లు పెట్టారు. ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, కలికి మాధవరెడ్డి, గ్రామ పెద్దలు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



సంగ్రామ యాత్ర ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

కలువాయి: ఎస్సీ వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించే వరకు తమ పోరాటం ఆగదని ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు మందా పెంచలయ్య మాదిగ అన్నారు. కలువాయి మండలంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన రెండో విడత మాదిగల సంగ్రామయాత్ర బుధవారం ముగింపు సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాదిగలకు నమ్మక ద్రోహం చేస్తుందని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణే ధ్యేయంగా తమ ఉద్యమం 29 ఏళ్లగా సాగుతుందన్నారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 4వ తేదీన హైదరాబాద్, విజయవాడ నగరాల ముట్టడి కార్యక్రమానికి మాదిగలు తరలి వచ్చి, విజయవంతం చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణపై బీజేపీ అనుసరిస్తున్న వైఖరిని ఎండగడుతూ కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తెచ్చేందుకు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొల్లపల్లి రమేష్, సిసింద్రీ, ఎమ్మార్పీఎస్ కలువాయి అధ్యక్షులు దండు భార్గవ్, భరత్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

'గేటు' దాటేదెలా?

- తెరవని చెన్నై రైల్వే గేటు
- వాహనచోదకులకు తప్పని తిప్పలు



మూత పడిన చెన్నై రైల్వే గేటు

గూడూరు: పట్టణంలోని చెన్నైకు వెళ్లే రైల్వే మార్గంలో ఉన్న గేటు మరమ్మతు కారణంగా నెల రోజులకు పైగా మూసి వేసి ఉన్నారు. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనచోదకులు తిప్పలు పడుతున్నారు. ఒకటి, రెండు పట్టణాలకు మధ్య గూడూరు- చెన్నై, గూడూరు- తిరుపతి రైల్వే గేట్లు ఉన్నాయి. ఈ క్రమంలో చెన్నై రైల్వే గేటు మరమ్మతుల కారణంగా ఫిబ్రవరి 12 నుంచి 26వ తేదీ వరకూ గేటును మూసేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ మేరకు గేటు వద్ద బోర్డు కూడా ఏర్పాటు చేశారు. కానీ గేటు మూత వేసి నెల రోజులు దాటినా ఇప్పటి వరకు ఆ గేటు తెరవకపోవడంతో ఆ మార్గం మీదుగా రాకపోకలు నిలిచి పోయాయి. దీంతో ఆ మార్గం మీదుగా రెండో పట్టణంలోని పలు ప్రాంతాలతోపాటు, రూరల్ పరిధిలోని పాలిచర్ల, కొండాగుంట, వెందోడు, కాంద్ర తదితర గ్రామాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా అండర్ బ్రిడ్జి నుంచి వెళ్లాలంటే అక్కడ ఎప్పుడు, ఎంత సేపు ట్రాఫిక్ స్తంభిస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇలా పనులను సాగదీస్తూ నెలల తరబడి గేట్లు మూసేయడం ఏమిటని వాహన చోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో అండర్ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ స్తంభించకుండా, రెండు వైపులా పోలీసులను ఏర్పాటు చేస్తే తప్ప, తమకు కష్టాలు తీరవని వాహన చోదకులు వాపోతున్నారు. పోలీసులు ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.

సరదాకు సై.. మనసుకు హోయి



వేసవి ప్రారంభం కావడంతో భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. ఎండ తీవ్రతకు తోడు.. బుధవారం సెలవు దినం కావడంతో గ్రామాల్లోని యువకులు కాలువుల్లో సరదాగా ఈత కొట్టి మనసారా హాయిగా సేదతీరారు. దొరవారిసత్రం మండలంలోని మినమనముడి గ్రామ సమీపంలో నెర్రి కాలువలో పిల్లలు ఎండ తీవ్ర నుంచి ఉపసమనం పొందేందుకు ఈత కొడుతూ ఎంతో సరదగా గడుపుతున్న దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది. - దొరవారిసత్రం

నవ ఉషస్సులు నిండాలి

- ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే వరప్రసాద్ రావు
- మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు



మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఉగాది వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు: శ్రీ శోభకృత్ నామ సంవత్సరంలో అందరి జీవితాల్లో నవ ఉషస్సులు నిండాలని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు ఆకాంక్షించారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఆయన నియోజకవర్గ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఉగాదిని పురస్కరించుకుని గూడూరు రెండో పట్టణ పరిధిలోని మహాలక్ష్మి అమ్మ వారి ఆలయంలో ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం కమిటీ వారు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించి, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం దేవాలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, భక్తులకు అన్నదానం చేశారు. తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వినీష్ యాదవ్, సుభాన్, ఓంప్రకాష్ అగర్వాల్, మధు, వెంకటేశ్వర్లు, వాసు, సురేష్, వేణు, రెండో పట్టణ సీఐ వేంకటేశ్వరరావు, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో..

గూడూరురూరల్: ఉగాది సందర్భంగా గూడూరు మండలంలోని పాలిచెర్ల సమీపంలో ఉన్న కామాక్షిదేవి సమేత భీమేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. అనంతరం శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్ల కల్యాణాన్ని తిలకించారు. అనంతరం అన్నదానం చేశారు. అలాగే పట్టణంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి, కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించారు. శ్రీనారాయణమ్మ తల్లి అమ్మవారి గ్రామోత్సవం కనులపండువగా జరిగింది. పోలేరమ్మ ఆలయంలో యూత్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి.

పోలీస్‌స్టేషన్‌లో...

నాయుడుపేటటౌన్: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఉగాది సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. సీఐ సీహెచ్ ప్రభాకర్‌రావు సారథ్యంలో ఎస్‌ఐలు కృష్ణయ్య, వేణు, శ్రీకాంత్, రైటర్, హెడ్‌కానిస్టేబుల్ మస్తాన్, స్టేషన్ సిబ్బంది పూజల్లో పాల్గొన్నారు.

వెంకటగిరి రూరల్‌లో..

వెంకటగిరిరూరల్: ఉగాది వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వెంకటగిరి రూరల్, బాలాయపల్లి మండలాల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉన్న ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేపాకు తోరణాలతో మహిళలు, చిన్నారులు పోలేరమ్మతల్లికి ఎంతో ప్రీతి పాత్రమైన అంబిలి నైవేద్యం భక్తిశ్రద్ధలతో తలపై పెట్టుకుని తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఆసాదుల తప్పెట్ల తాళాలతో అమ్మవారి ఆలయంలో పూజలు వైభవంగా జరిగాయి. ఉగాది పచ్చడి ప్రసాదంగా పంపిణీ చేశారు.



గూడూరు రూరల్: శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



నాయుడుపేట టౌన్: పూజలు చేస్తున్న ఎస్‌ఐ పోలీసులు



వెంకటగిరి: గ్రామదేవత పోలేరమ్మకు భక్తులు సమర్పించిన అంబిలి

మలుపులు.. ప్రమాదాలకు నిలయాలు

ఓజిలి: గ్రామీణ రహదారుల్లోని మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ప్రమాదాలను నివారించాల్సిన అధికారులు పర్యవేక్షణ కొరవడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మండలంలోని పెదపరియ క్రాస్, పెదపరియ, చిలమానుచేను, ఆర్మేనిపాడు, వజ్జవారిపాళెం, ఇనుగుంట గ్రామాలకు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారుల్లో మలుపులు అధికంగా ఉన్నాయి. అలాగే ముమ్మాయపాళెం, మాచవరం, తిరుమలపూడి గ్రామాలకు రోడ్లలోనూ మలుపులు అధికంగా ఉన్నాయి. ఈ మలుపులు ఎల్, ఎస్ ఆకారంలో ఉన్నాయి. వాహన చోదకులు ఈ మలుపుల్లో ప్రమాదాల బారిన పడుతున్నారు. రహదారులకు చుట్టు ప్రక్కల పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి రోడ్డును కమ్మేస్తున్నాయి. ఈ క్రమంలో రాత్రి సమయాల్లో వాహన చోదకులు ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక పోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల ఆర్మేనిపాడు గ్రామం వద్ద ఓ మలుపు వద్ద ద్విచక్రవాహనం రోడ్డు ప్రమాదానికి గురై ముగ్గురు విద్యార్థులు మత్యువాత పడ్డారు. రోడ్డు మలుపులు వద్ద అధికారులు 20 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన సూచిక బోర్డులను పిచ్చి మొక్కలు కమ్మివేయడం, అవి తుప్పుపట్టిపోవడంతో కనిపించడం లేదు.

దీంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని వాహనచోదకులు వాపోతున్నారు. రోడ్డుకిరువైపులా ఉన్న చెట్లు తొలగించి, మలుపులు వద్ద కొత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ముమ్మాయపాళెం వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు